3 నుంచి 6 వరకు బాస్కెట్‌బాల్ టోర్నీ

కవాడిగూడ: తెలంగాణలో మొదటిసారిగా రాష్ట్రస్థాయిలో బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.శ్రీధర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని పలు నగరాల నుంచి మొత్తం 500 క్రీడాకారులు రాగా, వారిలోంచి ఆరు టీమ్‌లను ఎంపిక చేసినట్లు చెప్పారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని హోటల్ మారియెట్‌లో అసోసియేషన్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. జూలై 3వ తేదీ నుంచి 6 వరకు బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ప్రీ సీజన్ పోటీలను కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రంగారెడ్డి నుంచి రంగారెడ్డి రైనోస్, మహబూబ్‌నగర్ నుంచి మహబూబ్‌నగర్ బుల్స్, నిజామాబాద్ నుంచి నిజామాబాద్ నవాబ్స్, కరీంనగర్ నుంచి కరీంనగర్ కింగ్స్, హైదరాబాద్ నుంచి హైదరాబాద్ హాక్స్, వరంగల్ నుంచి వరంగల్ వారియర్స్ టీమ్‌లు పోటీల్లో పాల్గొంటున్నాయని తెలిపారు. తెలంగాణలో మొదటిసారిగా ఐపీఎల్ తరహాలో బాస్కెట్ బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

నేడు లంబాడీల ఆత్మగౌరవ సభ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఈ నెల26వ తేదీన మధ్యాహ్నం 12గంటల నుంచి బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో లంబాడీల ఆత్మగౌరవ మహాసభ నిర్వహిస్తున్నట్లు సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్ నాయక్ తెలిపారు. ఆర్టీసీ కళాభవన్ నుంచి భారీ ప్రదర్శనతో సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు చేరుకుంటామని తెలిపారు. లంబాడీలకు అన్ని రంగాలలో జరుగుతున్న అన్యాయంపై గర్జిస్తామనిజిల్లాల నుంచి ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు.

వ్యవసాయ ఎగుమతులపై వర్క్‌షాప్

కాచిగూడ: నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటని విభాగం లెర్నింగ్ అండ్ కెరియర్ అపార్చునిటీస్‌లో బుధవారం 'వ్యవసాయ వ్యాపారం, ఆహారం, వ్యవసాయ ఎగుమతులు'అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. వర్క్‌షాపులో పరిశోధకులు డాక్టర్ బి.వేణుగోపాల్, డాక్టర్ చెన్నకేశవరెడ్డి పాల్గొని వ్యవసాయ ఎగుమతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐఐపీఎం బెంగుళూర్ ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాపు జరిగిందని కన్వీనర్ ప్రొ. ఈఎం సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డా. విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్, లెక్చరర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎస్ సర్వసభ్య సమావేశం జూలై 7న

కాచిగూడ: భాగ్యనగర్ టీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ (జీహెచ్‌ఎస్) సర్వసభ్య సమావేశం గచ్చిబౌలిలోని సొసైటీ ప్రాంగణంలో జూలై 7వ తేదీన సోమవారం ఉదయం 11గంటలకు జరుగుతుందని సొసైటీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణగౌడ్, కార్యదర్శి జి.మల్లారెడ్డి, కోశాధికారి ఎ.శ్రీనివాస్ తెలిపారు. సొసైటీ సభ్యులందరూ సొసైటీ ఐడీ కార్డులు తీసుకుని సమావేశానికి విధిగా హాజరు కావాలని వారు ఒక ప్రకటనలో కోరారు. సర్వసభ్య సమావేశంలో సొసైటీ సభ్యులకు శుభవార్త తెలిపే విధంగా సొసైటీ నిర్ణయం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం సొసైటీకి అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నందులకు సీఎం రేవంత్‌రెడ్డికి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

భారతీయ సంగీతానికి మూలం సామవేదం

నల్లకుంట: శ్రీరామ గానసభ ఆధ్వర్యంలో న్యూనల్లకుంటలోని న్యూరామాలయం ప్రాంగణంలో ప్రారంభమైన 56వ వాగ్గేయకార ఆరాధన సంగీతోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం సాయంత్రం కచేరి కార్యక్రమాన్ని శ్రీరామ గానసభ అధ్యక్షుడు జి.నాగరాజన్, ఉపాధ్యక్షుడు కేవీ తిరుమలరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ... వాగ్గేయకారులు అనేది భారతీయ శాస్త్రీయ సంగీతం నుంచి వచ్చిన సంప్రదాయమని చెప్పారు. సంగీతం ప్రాథమిక లక్షణాలు శృతి, రాగం, తాళం, పల్లవి మొదలైనవి శబ్ద లక్షణాలు అని తెలిపారు. భారతీయ సంగీతానికి మూలం సామవేదమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుమారి లాస్య వాగ్గేయకార కీర్తనలను తన మధురమైన గాత్రంలో ఆలపించి మంత్రముగ్ధులను చేశారు.

గొలుసు చోరీపై జీరో ఎఫ్ఐఆర్

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికురాలి మెడలోని గొలుసు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని మాదన్నపేట చంద్రయ్య హట్స్‌కు చెందిన బల ప్రవీణ్, ఆయన భార్య రాణి మంగళవారం నాగర్‌సోల్ నుంచి కాచిగూడకు అజంతా ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తున్నారు. రైలు బాసర రైల్వేస్టేషన్ వద్ద ఉండగా ఇద్దరు ఆగంతకులు పడుకుని ఉన్న ఆమె మెడలోని 17 గ్రాముల బంగారు గొలుసును లాక్కుని పారిపోయారు. బుధవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

ఎమర్జెన్సీని సమాజం మరువదు

మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి



విజయ్‌చారిని సన్మానిస్తున్న బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షులు భరత్‌గౌడ్ తదితరులు

కాచిగూడ: నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ దేశ ప్రజల ప్రాథమిక హక్కులను హరించి ఎమర్జెన్సీని విధించిందని బీజేపీ నేత, మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి అన్నారు. బీజేపీ నగర కార్యలయంలో బుధవారం ఎమర్జెన్సీ కమిటీ జిల్లా కన్వీనర్ కృష్ణగౌడ్ అధ్యక్షతన 'ఎమర్జెన్సీ వ్యతిరేక దినం'కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉన్న భారతదేశంలో ఇందిరాగాంధీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మండిపడ్డారు.

☛ జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి మాట్లాడుతూ... నాటి చీకటి రోజులు నేటికీ మరువలేమని అన్నారు. ప్రధానమంత్రి పదవి కోసం దేశ ప్రజలను ఇందిరాగాంధీ బలి చేసిందని ఆరోపించారు. దేశంలో ఎమర్జెన్సీని విధించి నేటితో 50 ఏళ్లు పూర్తయ్యిందని గుర్తు చేశారు. ఎమర్జెన్సీలో జైలు జీవితం గడిపిన సురేష్, శివరామ్‌ను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మనోహర్ రెడ్డి, లంకల దీపక్‌రెడ్డి, డాక్టర్ ఎస్.గౌతంరావు, కృష్ణయాదవ్, రాజశేఖర్‌రెడ్డి, సందీప్‌సాయి, నందకిషోర్ యాదవ్, ఉమా రమేష్ యాదవ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన 'ఎమర్జెన్సీ వ్యతిరేక దినం'కార్యక్రమంలో బీజేపీ నేతలు

ఎమర్జెన్సీలో పోరాడిన వీరులకు గుర్తింపు ఇవ్వాలి

ముషీరాబాద్: దేశంలోనే ఎమర్జెన్సీ చాలా దుఖకరమైన రోజులని రెండేళ్ల జైలు జీవితం గడిపిన మద్దూరి సంజీవరాజ్ పేర్కొన్నారు. ఆనాటి ఎమర్జెన్సీ విషయాలు నేటి భవిష్యత్ తరాలకు తెలిసే విధంగా వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఉన్నందున ఎమర్జెన్సీ సమయంలో కేసులు అనుభవించిన వారిని గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు గడిచిన సందర్భంగా బుధవారం రాంనగర్‌లోని ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన సంజీవ్‌రాజ్‌ను ఆయన నివాసంలో ఉద్యమకారులు, ఆయన మిత్రులు, బీజేపీ నాయకులు గుండగోని భరత్‌గౌడ్, పూస రాజు, రమేష్‌రాం, వెంకటరమణి తదితరులు ఘనంగా సత్కరించారు. అనంతరం సంజీవ్‌రాజ్ మాట్లాడుతూ.. రెండు రోజుల్లో పార్లమెంటులో చర్చపెట్టి ఎమర్జెన్సీలో పోరాడిన వీరులకు గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఎమర్జెన్సీలో అరెస్టైన విధానం నేటికి కళ్లముందు కదలాడుతుందని కన్నీటి పర్యంతం అయ్యారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, వినయ్‌కుమార్, మద్దూరి శివాజీ, ఠాగూర్ శక్తిసింగ్, బుర్ర రాజ్‌కుమార్, రామ్‌రెడ్డి, రఘునాథ్, బద్రినాథ్, జయపాల్‌రెడ్డి, జ్యోతి, ఆనంద్, ఉపేందర్, రామ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీని మర్చిపోలేం..

ముషీరాబాద్: ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్యాన్ని కూనీ చేసి ప్రతిఘటించిన వారిని జైలులో పెట్టిన ఘటనలను దేశ ప్రజలు ఎన్నటికి మర్చిపోలేరని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ అన్నారు. బుధవారం ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు అయిన సందర్భంగా భోలక్‌పూర్‌కు చెందిన వినయ్‌చారి ఎమర్జెన్సీని వ్యతిరేకించి పోరాడినందుకు ఆయనను బీజేపీ నాయకులు ముషీరాబాద్ శివాలయం చౌరస్తా వద్ద సన్మానించారు. ఆయన మాట్లాడుతూ... 1975లో ఎమర్జెన్సీ విధించి ప్రజల హక్కులను కాలరాసిన ఆనాటి ప్రభుత్వాన్ని ఎదిరించిన వారిని జైలులో పెట్టి హింసించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రమేష్‌రాం, బిజ్జి కనకేష్‌కుమార్, రాజశేఖర్, బద్రీనారాయణ, మహేష్‌కుమార్, నిత్యానంద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'నజరీ నక్షా'తో ఓటర్ల గుర్తింపు

- రాజకీయ పార్టీల సమావేశంలో డీఎంసీ రామాంజులరెడ్డి
- జూలై 2 నుంచి బీఎల్‌ఓలకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడి

ముషీరాబాద్: జీహెచ్‌ఎంసీ సర్కిల్–15 కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల సమావేశం డీఎంసీ రామాంజులరెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశానికి బీఆర్‌ఎస్ నుంచి కొండపల్లి మాధవ్, శ్రీనివాస్‌గుప్తా, బీజేపీ నుంచి రమేష్‌రాం, కాంగ్రెస్ పార్టీ నుంచి వాజీద్‌హుస్సేన్, టీడీపీ నుంచి చంద్రమోహన్, సీపీఎం, సీపీఐ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ఏ పోలింగ్ బూత్‌లో ఉండాల్సిన ఓటర్లు అదే పోలింగ్ బూత్ పరిధిలో ఉన్నారా? లేదా పక్క పోలింగ్ బూత్ పరిధిలో ఉన్నారా? అనే విషయం నజరీ నక్షా ఆధారంగా గుర్తించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

300 మంది బీఎల్‌ఓలకు శిక్షణ..

మూడు రోజుల క్రితం ప్రారంభమైన ఈ నజరీ నక్ష కార్యక్రమం మరో వారం కొనసాగించాలని సమావేశంలో నిర్ణయించారు. జూలై 2వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు బూత్ లెవల్ అధికారుల (బీఎల్‌ఓ)కు శిక్షణ ఇస్తామన్నారు. రోజుకు 50 మంది చొప్పున జీహెచ్‌ఎంసీ ఆఫీసులో ఇవ్వాలని నిర్ణయించారు. మొత్తం 300 మందికి శిక్షణ ఇవ్వనున్నారు.



సర్కిల్-15 కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన అధికారులు

నియోజకవర్గ ఓటర్లు 3,09,005 మంది...

జూన్ 25వ నాటికి ముషీరాబాద్ నియోజకవర్గంలో 3,09,005 మంది ఓటర్లు ఉన్నారని డీఎంసీ తెలిపారు. ఇందులో పురుషులు 1,57,933 మంది, స్త్రీలు 1,51,058 మంది, ట్రాన్స్‌జెండర్లు 14 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. ఓటర్లు తమ కార్డులో మార్పులు, చేర్పులు ఉంటే www.eci.gov.in చేసుకోవాలని కోరారు.

ట్యాంక్‌బండ్‌పై అర్ధరాత్రి వరకు విక్రయాలు జరపొద్దు

కవాడిగూడ: ట్యాంక్‌బండ్‌పై చిరు వ్యాపారులు నిబంధనలు పాటించకుంటే కేసులు నమోదు చేస్తామని గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీ యాదగిరి హెచ్చరించారు. రాత్రి సమయంలో 12 గంటల కంటే ముందు తమ షాపులను మూసేయాలని సూచించారు. లోయర్ ట్యాంక్‌బండ్ జగదీష్ మందిర్‌లో బుధవారం సాయంత్రం ట్యాంక్‌బండ్ స్ట్రీట్ వెండర్స్ అండ్ హాకర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ట్యాంక్‌బండ్‌పై ఎలాంటి గొడవలు జరిగిన స్ట్రీట్ వెండర్స్ బాధ్యత వహించాల్సి ఉంటుదన్నారు. ట్యాంక్ బండ్‌పై దాదాపు 95 మంది జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. ఉపాధి కొనసాగాలంటే జాగ్రత్తగా ఉండి నిబంధనలు పాటించాలన్నారు. ఈ సమావేశానికి గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎ. యాదగిరి, ట్యాంక్ బండ్ స్ట్రీట్ వెండర్స్ అండ్ హాకర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం. రమేష్‌రాం, బీఎంఎస్ నాయకులు శంకర్ తదితరులు హాజరయ్యారు.



'దేశంలో చట్టబద్ధ పాలన కరువైంది'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో వ్యక్తుల ఇష్టానుసారంగా పాలన సాగుతోందని.. చట్టబద్ధ పాలన కరవైందని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. బుధవారం సాయంత్రం ఎస్వీ కేంద్రంలో పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎమర్జెన్సీని మించిన నిర్బంధమే ఆపరేషన్ కగార్ అని అన్నారు. ఎమర్జెన్సీ అనేది ఏనాడు ఆగిపోలేదన్నారు. ఆనాడు ఎమర్జెన్సీ మాత్రమే చేస్తే ఈనాడు ప్రకటించి చంపేస్తున్నారని తెలిపారు. శవాలను కూడా మాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా దేశ ప్రతిష్ట దిగజారిపోతోందని అన్నారు. చట్టాన్ని, రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం పరిహాసం చేస్తోందని విమర్శించారు. దేశంలో నేటికీ పత్రికా స్వేచ్ఛ కరువైందన్నారు. స్వయం ప్రతిపత్తిగల సంస్థలను తమ నియంత్రణలో ఉంచుకొని బీజేపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రొ. మాడభూషి శ్రీధర్, పౌరహక్కుల సంఘం హైదరాబాద్ అధ్యక్షుడు వి.హనుమంతరావు, రాష్ట్ర కార్యదర్శి ఎన్.నారాయణరావు, జె.రాజారాం, హైకోర్టు అడ్వకేట్ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్వీ కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

బోనాల నిధులకు దరఖాస్తు చేసుకోండి

చిక్కడపల్లి: ముషీరాబాద్ అసెంబ్లీ నియోజవర్గం పరిధిలోని అమ్మవారి ఆలయాల నిర్వాహకులు బోనాలు నిధుల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ కోరారు. గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ... ఆలయం లెటర్‌హెడ్‌తో పాటు ఆలయం ఫొటో, ప్రెసిడెంట్, సెక్రటరీ, ఆధార్‌కార్డు జిరాక్స్, ఆలయం బ్యాంక్ అకౌంట్ వివరాలు తదితర వివరాలతో అందజేయాలని సూచించారు. గతేడాది పొందిన చెక్కు జిరాక్స్ కాపీని కూడా అందించాలన్నారు. గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు బీఆర్‌ఎస్ నేత ముచ్చకుర్తి ప్రభాకర్ (ఫోన్ నం.93922 22117)ను సంప్రదించాలన్నారు.

ధర్మ సమాజ్ పార్టీతోనే సామాజిక న్యాయం



భాగ్యలక్ష్మినగర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు రాజ్‌కమల్, జిసంతోష్‌కుమార్

కవాడిగూడ: బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ధర్మసమాజ్ పార్టీ ద్వారానే సామాజిక న్యాయం జరుగుతుందని ఆ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కమల్ అన్నారు. బుధవారం ధర్మసమాజ్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ జిల్లా ముషీరాబాద్ నియోజకవర్గం హైదరాబాద్ జిల్లా కోకన్వీనర్ గుడపరిత సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో కవాడిగూడ డివిజన్ భాగ్యలక్ష్మినగర్‌లో ఏర్పాటు చేసిన ధర్మ సమాజ్ పార్టీ జెండాను రాజ్ కమల్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ధర్మా సమాజ్ పార్టీ ద్వారానే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ , బీఆర్‌ఎస్ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని ఆయన ఆరోపించారు.

☛ బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలను ఎన్నికల సమయంలో ఓట్లు దండుకొని మోసం చేస్తునానయని ఆయన ఆరోపించారు. ధర్మ సమాజ్ పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను పార్టీ నాయకులు ఇంటింటికి వివరించి బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ నేతలు గోల్కొండ పార్టీ నేతలు గోల్కొండ కృష్ణ, గుడపర్తి సంతోష్‌కుమార్, నర్సింగ్ , సైదులు, బాబు, దేవానంద్ , మనోజ్‌కుమార్, శివప్రసాద్‌గౌడ్, శ్రీధర్, మహేష్, రాజు, రమేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను పెంచుతూ జీవో జారీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీజీఆర్ నారగోని

కాచిగూడ: స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 42శాతంకు పెంచుతూ జీవో జారీ చేసిన తర్వాతే ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియ చేపట్టాలని పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని డిమాండ్ చేశారు. బుధవారం నారాయణగూడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 73,74 రాజ్యాంగ సవరణల ప్రకారం ఆర్టికల్ 243డీ, 243టీ ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచుకోవటానికి రాజ్యాంగం అవకాశం కల్పించిందన్నారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం, 201 క్లాజు ప్రకారం, బీసీ కులగణన రిపోర్టు ఆధారంగా స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు 42శాతానికి పెంచుతూ జీవోను జారీ చేసుకునే అధికారాన్ని రాజ్యాంగమే కల్పించిందన్నారు. ఎవరైనా కోర్టుకు వెళ్తే బీసీ కులగణన రిపోర్టు లెక్కలను సమర్పించాలన్నారు. అలా కాకుండా 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు చేయటం మానుకోవాలని సూచించారు. బీసీలను మోసం చేయటానికి కాంగ్రెస్ కుటిల ప్రయత్నాలు చేస్తే తగిన మూల్యాన్ని చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో కొల్లూరు శంకర్, కేబీ శ్రీధర్, సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

కాచిగూడ: రాష్ట్రంలో అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం విద్యాశాఖ ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రం సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం చంటి ముదిరాజ్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోందన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులతో పాటు ఇతర ఫీజులు బలవంతంగా వసూలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పుడే ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీలను నియంత్రించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సూర స్రవంతి, మల్లం వెంకటేశం, చింతల రాఘవేందర్ ముదిరాజ్, ఎస్.దిలీప్ రావు, గోపీనాథ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

అంబర్‌పేట: గుట్టుచప్పుడు కాకుండా ఆన్‌లైన్ సట్టా నిర్వహిస్తున్న ముఠా గుట్టును సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.20 లక్షల విలువ చేసే వస్తువులు, నగదును స్వాధీనం చేసుకున్నారు. అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ కాగజ్‌నగర్‌కు చెందిన వడెవల్లి నవీన్(24), పూదరి సాయికిరణ్(24), సోమ మహేందర్(24), బింగి సాయికిరణ్(23), బింగి అవినాష్(30), హుజునగర్‌కు చెందిన సాన సాయిప్రీతమ్(25)లు ముఠాగా ఏర్పడి ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిర్వహిస్తున్నారు. వీరు రెండు నెలల క్రితం బాగ్‌అంబర్‌పేట నందనవనంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని బెట్టింగ్ దందా ప్రారంభించారు. మహారాష్ట్రలో పేరొందిన కళ్యాణ్ బెట్టింగ్ సంస్థలతో పాటు పలు పేరొందిన బెట్టింగ్ సంస్థల పేర్లపై నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్లను ప్రారంభించారు. వాటి ఆధారంగా బెట్టింగ్‌లకు పాల్పడే వారిని ఆకర్షిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వాహకులపై దాడి చేసి అరెస్టు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం అంబర్‌పేట పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

మహిళా పీఎస్ కౌన్సెలింగ్ కేంద్రంలో వ్యక్తిపై హత్యాయత్నం

అంబర్‌పేట: మహిళ పోలీసు స్టేషన్‌లో దంపతులకు కౌన్సెలింగ్ చేస్తుండగా ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. ఈ సంఘటన బుధవారం అంబర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మెట్టుగూడకు చెందిన జేమ్స్, జన్నిఫర్ దంపతులు. వీరి మధ్య కుటుంబ తగదాలు నెలకొన్నాయి. అంబర్‌పేటలో ఉన్న ఈస్ట్‌జోన్ మహిళ పోలీసుస్టేషన్‌లో జన్నిఫర్ ఫిర్యాదు చేసింది. దీంతో మహిళ పోలీసుస్టేషన్ అధికారులు దంపతులను బుధవారం కౌన్సిలింగ్‌కు పిలిచారు. భార్య జెన్నిఫర్‌తో పాటు ఆమె సోదరి గౌసియా ఫాతిమా, మరిది అక్రమ్‌ఖాన్ సైతం హాజరయ్యారు. కౌన్సెలింగ్ మధ్యలో జేమ్స్ బయటకు వెళ్లి అతడి కుమారుడికి కౌన్సిలింగ్ విషయం చెప్పాడు. అమ్మను, నన్ను విడదీయాలను చిన్నమ్మ గౌసియా, చిన్నాన్న అక్రమ్‌ఖాన్ ప్రయత్నిస్తున్నారని చెప్పారు. దీంతో జెన్నిఫర్, జేమ్స్‌ల కుమారుడు ఆండ్రీమథ్యూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్రమ్‌ఖాన్‌పై కౌన్సెలింగ్ సెంటర్‌లో బ్లేడ్‌తో దాడి చేశాడు. ఈ దాడిలో అక్రమ్‌ఖాన్ తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడ ఉన్న పోలీసులు అతడిని అడ్డుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అంబర్‌పేట పోలీసులు హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం



గోల్నాక కార్డన్ సెర్చ్‌లో మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి

అంబర్‌పేట: అసాంఘిక శక్తుల పట్ల ప్రజలు పోలీసులకు సహకరించాలని ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి కోరారు. బుధవారం అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌కి ఆయన హాజరయ్యారు. గోల్నాక అన్నపూర్ణనగర్, దుర్గానగర్ తదితర ప్రాంతాల్లో సుమారు 200 మంది పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఆకతాయిల పట్ల నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సామాన్యులకు పోలీసు స్టేషన్‌లో న్యాయం జరుగకపోతే ఏసీపీ, డీసీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్డన్ సెర్చ్‌లో సరైన ధ్రువపత్రాలు లేని 70 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 30 వాహనాలకు మొత్తం రూ.లక్షకు పైగా చలాన్లు ఉన్నట్లు వెల్లడైంది. ఓ వాహనదారుడు తన ద్విచక్ర వాహనానికి కారు నంబర్‌ను పెట్టుకుని నడుపుతున్నట్లు గుర్తించారు. అతడిపై కేసు నమోదు చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 6 గ్యాస్ సిలిండర్లు, 29 మద్యం సీసాలను పట్టుకున్నారు. ఐదుగురు పాత నేరస్తులను పట్టుకుని పద్ధతిగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, ఏసీపీ హరీష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్, హబీబుద్దీన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్ల నిర్ణయంపై బీసీ సంఘాల హర్షం



చిక్కడపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బాలగౌని బాలరాజ్‌గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాకే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, బీసీ సమాఖ్య అధ్యక్షులు సూగూరి దుర్గయ్యగౌడ్, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ తెలిపారు. బుధవారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ... 42 శాతం బీసీ రిజర్వేషన్లను 30 రోజుల్లో చేసి ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం హైకోర్టును గడువు కోరగా సెప్టెంబర్ 30 లోపు ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు సూచించిందని వారు తెలిపారు. రిజర్వేషన్లపైన పూర్తి స్పష్టతతో ప్రభుత్వం ఉందని ఇంకొంచెం గడువు కావాలని ఆ గడువులోపు రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసి ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. అందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్,పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వారు చెప్పారు. తక్షణమే సీఎం రేవంత్‌రెడ్డి అఖిల పక్షనేతలు, బీసీ సంఘాల నాయకులను ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధాని మోదీని ఒప్పించాలని పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు ఆమోదం పొందేలా చొరవ చూపాలని వారు కోరారు. బీసీలకు జనాభా దామాషా పద్దతిలో అన్ని రంగాలలో సమన్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. తెలంగాణకు చెందిన బీజేపీ కేంద్రమంత్రులు, ఎంపీలు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రధాన మంత్రిని ఒప్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ జన సైన్యం అధ్యక్షులు సింగం నాగేష్‌గౌడ్, బీసీ రచయితల సంఘం అధ్యక్షులు బైరు శేఖర్, ఎంబీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు బడే సాబ్, బీసీ సంఘం గౌరవ అధ్యక్షులు బాలగౌని వెంకటేష్ గౌడ్, పోతగాని ఐలన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఫంక్షన్‌హాల్ తాళాన్ని పగులగొట్టిన యజమాని

పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు

అంబర్‌పేట: ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో సీజ్ చేసిన ఫంక్షన్‌హాల్‌ను బలవంతంగా యజమానులు ప్రారంభించుకున్నారు. జీహెచ్‌ఎంసీ వేసిన తాళాన్ని పగులగొట్టారు. దీంతో జీహెచ్‌ఎంసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన బుధవారం అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... అంబర్‌పేట ప్రధాన రోడ్‌లో ఉన్న క్రౌన్ ఫంక్షన్‌హాల్‌కు సంబంధించి రూ.30లక్షల ఆస్తి బకాయి ఉంది. దీంతో గత సోమవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 అధికారులు ఫంక్షన్‌హాల్‌ను సీజ్ చేశారు. దీనిపై ఫంక్షన్‌హాల్ యజమాని అహ్మద్ జీహెచ్‌ఎంసీ అధికారులపై చిందులు వేశారు. అంతేకాకుండా మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులు ఫంక్షన్‌హాల్‌కు వేసిన తాళాన్ని పగులగొట్టి తెరుచుకున్నాడు. సమాచారం అందుకున్న జీహెచ్‌ఎంసీ అధికారులు నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆస్తిపన్ను కోసం ఇచ్చిన చెక్కులు 15 సార్లు బౌన్స్ అయ్యాయని తెలిపారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.